ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్‌కు రేపటి వరకే అవకాశం



నోటీసులు అందజేస్తున్న ఏఎంహెచ్ఓ డాక్టర్ మంజుల

మల్కాజిగిరి: ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ గడువు ఈనెల 31వ తేదీతో ముగుస్తుందని మల్కాజిగిరి సర్కిల్ ఏఎంహెచ్ఓ డాక్టర్ మంజుల తెలిపారు. మల్కాజిగిరి సర్కిల్‌లో ఇప్పటి వరకు సుమారు రూ. 91లక్షలు వసూలైందన్నారు. ఇంకా చెల్లించాల్సిన వారు ఆన్‌లైన్, మీసేవ, జీహెచ్‌ఎంసీ యాప్, సర్కిల్ కార్యాలయంలోని సిటిజన్ సెంటర్‌లో చెల్లించవచ్చన్నారు. గడువు ముగిసిన తర్వాత మార్చి వరకు 25 శాతం, మార్చి తర్వాత 50 శాతం అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంటుందని, ముందుగానే చెల్లించాలన్నారు. దీర్ఘకాలికంగా బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేశామన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి



రామంతాపూర్: డివిజన్ పరిధిలోని బస్తీల్లో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు బుధవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రతి జయంతి, వర్ధంతి కార్యక్రమానికి పూలమాలలతో అలంకరించి కార్యక్రమాన్ని చేపట్టాలని ఆమె వినతిపత్రంలో కోరారు.

రాష్ట్రాభివృద్ధికి విదేశీ పెట్టుబడులు దోహదం



మంత్రి శ్రీధర్‌బాబుతో సంతోష్‌రెడ్డి తదితరులు

మల్లాపూర్: రాష్ట్రాభివృద్ధికి విదేశీ పెట్టుబడులు ఎంతగానో దోహదపడతాయని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన మంత్రి శ్రీధర్ బాబును మాజీ సైనికుడు, యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి సంతోష్‌రెడ్డి, మాస్టర్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేతలు సుధాకర్ రెడ్డి, హరిబ్రహ్మం, రామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, అభిజిత్, బాను ప్రకాష్‌రెడ్డిలు కలిశారు.

విద్యుత్ లైన్‌మెన్‌పై దాడి

మల్కాజిగిరి: విద్యుత్ బకాయిలు చెల్లించాలని అడిగిన జూనియర్ లైన్‌మెన్‌పై దాడిచేసిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై గణేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్న కురం సురేష్ ఈనెల 27న క్రిష్ణనగర్ ఆర్టీసీకాలనీలో ఇర్ఫాన్ అనే వ్యక్తి బిల్లు చెల్లించకపోవడంతో ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన ఇర్ఫాన్ సురేష్‌ను అసభ్యపదజాలంతో దూషిస్తూ.. అతడిపై దాడిచేసి ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశాడు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఏఏఈ నర్సిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాంబు బెదిరింపులపై విచారణ చేపట్టాలి

మల్లాపూర్: నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో బాంబు బెదిరింపులపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ బుధవారం నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్‌కు ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ఈ మెయిల్ కాల్స్ ద్వారా బాంబు ఉన్నట్లు సమాచారం వస్తుందని, ఆ సమయంలో చదువుకుంటున్న వేలాది మంది విద్యార్థులు భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. దీనిపై విచారణ చేపట్టి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, స్వప్న, ప్రీతం, అంజి, సంజుయాదవ్, మహేంద్ర తదితరులున్నారు.

ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు

హబ్సిగూడ: డివిజన్‌లోని కెప్టెన్ వీరారెడ్డి పార్కులో ఎల్‌ఈడీ హైమాస్ విద్యుత్‌లైట్లను ఏర్పాటు చేశారు. బుధవారం స్థానిక కార్పొరేటర్ కక్కిరేని చేతనాహరీష్ చేతుల మీదుగా ఎల్‌ఈడీ హైమాస్ లైట్లను ప్రారంభించారు. స్థానికుల సౌకర్యార్థం డివిజన్‌లోని పార్కుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. ఈఈ పున్నానాయక్, డీఈ రవీందర్‌రెడ్డి, ఏఈ ప్రసాద్, పార్క్ కమిటీ సభ్యులు రుద్రశేఖర్, రాఘవరెడ్డి, రంగారెడ్డి, ప్రభాకర్‌రావు, సునీల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, బీజేపీ నేత సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎదురు చూపులు !



మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం

- పథకాలు ఎప్పుడు అందుతాయోనని..
- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులకు దరఖాస్తులు
- కనిపించని ప్రజాపాలన లబ్ధిదారుల వివరాలు

మల్కాజిగిరి: నూతన ప్రభుత్వం ఏర్పాటుతో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల్లో రేషన్ కార్డు లేకపోవడంతో అదే కార్యక్రమంలో విడిగా ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. తదానంతరం కుటుంబ సర్వే ద్వారా రేషన్‌కార్డులు, ఇళ్లులేని లబ్ధిదారుల డేటాను సేకరించారు. ప్రజాపాలనలో 1,56,889 దరఖాస్తులు రాగా.. వాటిలో సుమారు 19,885 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కుటుంబ సర్వే, ప్రజాపాలన ద్వారా సుమారు 43,284 మందిని ఇందిరమ్మ ఇంటి పథకం కోసం సర్వేలో ఎంపిక చేశారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీ సమయంలో వివరాలు నమోదు కాని దరఖాస్తుల సంఖ్య కూడా భారీగానే ఉంది.

> నగరంలోని పేద, మధ్య తరగతి ప్రజలు తమకు కూడు, గూడు, గుడ్డ ఈ మూడు ఉంటే కొండంత భరోసాగా ఉంటారు. ప్రభుత్వాలు మారి పథకాల పేర్లు మార్చినా దశాబ్దాలుగా సొంతిళ్లు, రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

◆ గ్రామసభల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇంటి కోసం జాబితా ప్రకటించినప్పటికీ జీహెచ్‌ఎంసీ పరిధిలో వార్డు సభలు ఇంకా నిర్వహించలేదు. గ్రామాల్లో వచ్చిన వ్యతిరేకతతో నిర్వహిస్తారో.. లేదో అనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

◆ గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇంటింటికి తిరిగి నిర్వహించిన సర్వే ద్వారా అందిన సమాచారం ద్వారా నిబంధనల ప్రకారం.. సుమారు 3,100 మంది గుర్తించి సర్వే పూర్తి చేసి సివిల్ సప్లై అధికారులకు అందజేశారు.

ప్రామాణికంగా తీసుకోలేదు..

ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను ప్రామాణికంగా తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మీ సేవ ద్వారా ఏళ్ల క్రితం పేర్లు చేర్చడానికి, తొలగించడానికి దరఖాస్తు చేసుకున్న వారు చాలామంది ఉన్నారు. వారి దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుని రేషన్‌కార్డులు జారీచేస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

వార్డు సభల నిర్వహణపై నిర్ణయం తీసుకోలేదు



నగరంలో వార్డు సభల నిర్వహణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేసే టప్పుడు కొంతమంది వివరాల నమోదు కాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు ప్రజాపాలన రశీదుతో కార్యాలయానికి వస్తే సర్వేలో అవకాశం కల్పిస్తాం.

– రాజు, డిప్యూటీ కమిషనర్, మల్కాజిగిరి

అధికారుల బాధ్యతారాహిత్యమే



మల్కాజిగిరి సర్కిల్‌లో ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమంది వివరాలు ఆన్‌లైన్ కాకపోవడం అధికారుల బాధ్యతా రాహిత్యమే. ఇప్పటి వరకు చాలాసార్లు ఇంటింటికి వచ్చి సర్వే చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాల కోసం దరఖాస్తు చేయాల్సిందే. ప్రభుత్వానికి ప్రజల ఓట్లపై ఉన్న శ్రద్ధ వారికి పథకాలు అందజేయడంలో లేదు.

– నాగరాజు, మల్కాజిగిరి

కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి



ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని శ్రామికనగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని బుధవారం శ్రామికనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో ఇటీవల ఏర్పాటు చేసిన శ్రామికనగర్ ఎంట్రెన్స్‌తో పాటు ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న సుమారు 18 వందల గజాల్లో ఉన్న స్థలంలో పెద్దపెద్ద రాళ్లు, రప్పలు ఉన్నాయని, వాటిని తొలగించి కాలనీకి ఉపయోగపడేలా పార్కుతో పాటు కమ్యూనిటీహాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. నాయకులు భాగ్యానందరావు, శ్రామికనగర్ అసోసియేషన్ ప్రతినిధులు గౌస్‌భాయ్, అబ్దుల్ హమీద్, హేమంత్, శ్రీనివాసరావు, మహ్మద్ ఇస్మాయిల్, అబ్దుల రహమాన్, కరీం పాల్గొన్నారు.

ఉప్పల్ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయింపు



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కళాశాల సిబ్బంది

ఉప్పల్: ఉప్పల్ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం స్థలం కేటాయించిందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రకటించారు. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయకుమార్, ఉపాధ్యాయులు తిరుపతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉప్పల్ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరామని, సానుకూలంగా స్పందించిన మంత్రి రామంతాపూర్ రోడ్డు డీఎస్‌ఎల్‌మాల్ పక్కన ఉన్న రెండెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందన్నారు.

హైడ్రా కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే



హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ చిన్మయమార్గం బాధితులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్‌లతో కలిసి బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటీవల చిన్మయమార్గం అసోసియేషన్ ప్రతినిధులు 66 ఫీట్ల మాస్టర్‌ప్లాన్ ఉందని, దానికి అనుగుణంగా రోడ్డు ఆక్రమణలకు పాల్పడిన ఇళ్లను కూల్చివేయాలని హైడ్రాను ఆశ్రయించారన్నారు. దీంతో కొన్ని ఇళ్లను మార్కింగ్ వేశారని, తాము దశాబ్దకాలంగా ఇక్కడ నివాసం ఉంటున్నామని, కాలనీలో 66 ఫీట్ల రోడ్డు లేదని హైడ్రా కమిషనర్‌కు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. మేకల రాముయాదవ్, కాలనీ బాధితులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న జాహిద్‌నగర్ వాసులు

ఉప్పల్ : జాహిద్‌నగర్ వెల్ఫేర్ సొసైటీలో సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం కాలనీవాసులు డ్రైనేజీ తదితర సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గీతాప్రవీణ్‌ముదిరాజ్, ఫారుక్ సునీల్, జునైద్ ఆరిఫ్, సలీమ్, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గౌతంనగర్: లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా గౌతంనగర్‌లో సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ కృష్ణప్రసాద్, ఏఎంహెచ్‌వో డాక్టర్ మంజుల హాజరై ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కె.ఇన్నారెడ్డి, కె.కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, శేఖర్‌రెడ్డి, లక్ష్మీమూర్తి, సురేష్‌కుమార్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి



రామంతాపూర్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం రామంతాపూర్ ప్రధాన రహదారిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమావాస్య రోజున అన్నప్రసాద వితరణ చేయడం వల్ల పుణ్యఫలం లభిస్తుందన్నారు. గత 50 నెలలుగా అమావాస్య రోజున అన్నప్రసాదం అందజేస్తున్న ప్రతినిధులను ఆమె అభినందించారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శంభు పాండయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేష్, కొత్త ట్రెజరర్ గుప్తా, ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, నాగేష్‌గుప్తా పాల్గొన్నారు.

కుషాయిగూడ: మౌని అమావాస్య సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలో వాసవీ మిత్రమండలి ఆధ్వర్యంలో కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద మారుతీ మిత్రమండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ చేశారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ అంజయ్య ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.సీసీఎస్ ప్రతినిధి ఎంపల్లి పద్మారెడ్డి, వాసవీమిత్రమండలి ప్రతినిధులు నాగరాజు, శ్రీనివాస్, చక్రపాణి, అశోక్, శ్రీనివాస్, నవీన్, మారుతీమిత్రమండలి అధ్యక్షుడు అశోక్‌చారి, ప్రధాన కార్యదర్శి వరగంటి హనుమంతు, మచ్చ బాబుగౌడ్, సురేష్‌గౌడ్, మల్లేష్, వేణుగోపాలచారి, అనురాధ పాల్గొన్నారు.




కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద..

ఘనంగా మన్యుసూక్త హోమం..

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి ఆంజనేయస్వామి దేవాలయంలో బొల్లంగి అమావాస్య సందర్భంగా అర్చకులు మన్యుసూక్త హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. అర్చకులు సాయిఫణి, చింతల మల్లేష్‌యాదవ్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్: పుష్యమాస అమావాస్య సందర్భంగా ఉప్పల్‌లోని శ్రీ శివ శంకర మహామ్మాయి దేవాలయంలో బుధవారం కుంకుమార్చనతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు. ముఖ్యఅతిథి గా విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన చైర్మన్ లాలు కోట వెంకటాచారి ప్రారంభించారు. భిక్షపతి, రాజగోపాలాచారి, శ్రీను, పల్లెర్ల గోపి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



కుషాయిగూడ: కాప్రాకు చెందిన మన్నె సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం బుధవారం కుషాయిగూడ ఇండస్ట్రియల్ క్యాంటిన్ వద్ద మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మన్నె మిత్రమండలికి చెందిన 500 మంది రక్తదానం చేయగా.. సుమారు 5 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. మన్నె నాగఫణీంద్ర, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్‌ఎస్ నేత సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో..

ఉప్పల్: లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ సహకారంతో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డైరెక్టర్ జాన్ కల్లరక్కల్, ప్రిన్సిపాల్ జయంతిరెడ్డి మాట్లాడుతూ.. ఏడాదికోసారైనా రక్తదానం చేసి ముగ్గురి ప్రాణాలు కాపాడేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

ఉప్పల్: బీసీ సంఘం ఉద్యోగుల సమ్మేళనంలో రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరుస్తూ మాట్లాడిన ఎమ్మెల్సీ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో రెడ్డి సంఘం మహిళలు ఫిర్యాదు చేశారు. ఉన్నత పదవిలో ఉండి కులాలపై అభ్యంతరకరంగా మాట్లాడటం సరికాదన్నారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు

అల్వాల్: లోతుకుంటలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి 35వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం స్వామివారికి మహాన్యాస రుద్రాభిషేకం, కుంభాభిషేకం, సుందరకాండహోమం, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



ఎల్‌వోసీ పత్రాన్ని అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: కష్టాల్లో ఉన్న సామాన్యులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్‌కు చెందిన లక్ష్మీ అనారోగ్యం కారణంగా నిమ్స్‌లో చికిత్స చేయించాలని, ఆమె కుటుంబసభ్యులు కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ కోరగా.. పరమేశ్వర్‌రెడ్డిని సంప్రదించారు. అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన రూ.2,50,000ల ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు.

ప్రజా పోరాటాలకు మంద కృష్ణ స్ఫూర్తి

మల్లాపూర్: గత 30 ఏళ్లగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో అలుపెరగని పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు మందకృష్ణ మాదిగ అని కార్మిక విభాగం నేతలు కొనియాడారు. ప్రజా పోరాటాలకు స్ఫూర్తి నింపిన ఆయనకు పద్మశ్రీ అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అంజి, నల్ల రాధాకృష్ణ, హరిబాబు, నాగరాజు, యాకస్వామి, మహేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మందకృష్ణతో నాచారం ఎమ్మార్పీఎస్ నేతలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఎస్ఎండీసీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కల్యాణ్‌నగర్, ఎస్ఎండీసీ కాలనీ, ఈస్ట్ ఆనంద్‌బాగ్, బ్యాంక్‌కాలనీ, తాళ్ల బస్తీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

ఉప్పల్: సరస్వతీనగర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు లక్ష్మారెడ్డి కాలనీ, విజయపురికాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీ, సాయినగర్ కాలనీ ఆర్టీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు.

◆ హబ్సిగూడ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీన్‌హిల్స్ కాలనీ, వీవీనగర్, బృందావనకాలనీ, స్నేహనగర్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గణేష్ తెలిపారు.

మేడిపల్లి: 11కేవీ మై విల్లాస్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం 4.00 గంటల నుంచి 5.00 గంటల వరకు ఓల్డ్ విలేజ్, టీఎస్ ఫుడ్స్ కాలనీ, కాకతీయకాలనీ, కమలానగర్, జయశ్రీ కాలనీ మై విల్లాస్, రామకృష్ణానగర్ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఏఈ హరినాథ్ సగ్గ ప్రకటించారు.



బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి



ఎంపీ ఈటలతో స్థానిక బీజేపీ నేతలు

మల్లాపూర్: బూత్‌స్థాయి నుంచి బీజేపీ పార్టీని బలోపేతం చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం మల్లాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నేతలతో ఎంపీ సమావేశమై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గూడూరు శైలేష్‌రెడ్డి, బీజేపీ నేతలు శ్రీకాంత్‌రెడ్డి, రవిగంగాధర్, ముత్యంరెడ్డి, విజయ్, లక్ష్మారెడ్డి, మురళి, మాధవ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

మల్లాపూర్: నాంది ఫౌండేషన్ జాబ్ ఉత్సవ్ ఆధ్వర్యంలో బుధవారం నాచారం సెయింట్ పాయిస్ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేళాగిని మాట్లాడుతూ.. మహేంద్ర, టెక్ మహేంద్ర దిగ్గజ కంపెనీలు మంచి ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు కల్పించడం సంతోషకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1300 మంది అభ్యర్థులు జాబ్‌కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ జాబ్ ఉత్సవ్‌లో నిజామాబాద్, కరీంనగర్, సిద్ధిపేట్, గజ్వేల్, జనగాం వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి మంగాపురం శ్రీవారి బ్రహ్మోత్సవాలు

> దేవాదాయ, ధర్మాదాయ ఆధీనంలోకి ఆలయం



ముస్తాబైన మంగాపురం శ్రీవారి ఆలయం

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ మంగాపురం కాలనీలోని శ్రీనివాసుడు మాహిమాన్వితుడై కొలువుదీరాడు. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ఇక్కడ రెండు రూపాల్లో భక్తులకు దర్శనమివ్వడం ఈ ఆలయ ప్రత్యేకత. భక్తుల విశ్వాసంతో అనతి కాలంలోనే మంగాపురం శ్రీనివాస ఆలయం ప్రసిద్ధి గాంచి విరాజిల్లుతోంది. దీంతో ఈ ప్రాంతవాసులు ఇష్టదైవంగా కొలుస్తూ నిత్యం వందల సంఖ్యలో స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు ప్రకటించారు.

మహిళ ఆత్మహత్య



లక్ష్మి (ఫైల్)

కుషాయిగూడ: మానసికస్థితి సరిగా లేని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జుననగర్, ఇందిరానగర్ కాలనీకి చెందిన నాగనోళ్ల లక్ష్మి (44) నాగిరెడ్డికి 19 ఏళ్ల క్రితం వివాహం కాగా.. వీరికి ఇద్దరు సంతానం. భార్య గత నాలుగేళ్లుగా ఆరోగ్యం దెబ్బతినడంతో మానసికంగా కుంగిపోయింది. అప్పటి నుంచి కుటుంబసభ్యులతో తరచుగా గొడవ పడుతూ ఉండేదని, ఈ క్రమంలో బుధవారం తన బెడ్రూమ్‌లో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందిందని వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ న్యూ మిర్జాలగూడ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద జరుగుతున్న సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, నాయకులు సిరిగిరి రాజు, సంతోష్‌కుమార్, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, జన్నయ్య, ప్రభాకర్, సాయికుమార్, విక్కీ, పార్థు, మహేష్‌చారి, కాలనీవాసులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు